క్లుప్తంగా

ఆధార్, వేలిముద్రలు ఇవ్వవద్దు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటింటికి వచ్చి ఆధార్ నెంబర్, వేలి ముద్రలు తీసుకుని ఎల్ఈడీ బల్బ్‌లు ఇస్తామంటూ మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల ప్రమత్తంగా ఉండాలని కొత్తపేట సీఐ చిన్న కొండలరావు సూచించారు. కొంత మంది వ్యక్తులు ఇంటింటికి వచ్చి రూ.10 తీసుకుని మీకు ఎల్ఈడీ బల్బ్‌లు ఇస్తామని ప్రజలను నమ్మించి మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఆధార్ నెంబర్, వేలి ముద్రలు ఇవ్వడం ద్వారా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆధార్ నెంబర్, వేలి ముద్రలు ఇవ్వడం ద్వారా మీ ఖాతాలో నగదు ఖాళీ అయ్యే అవకాశం ఉందన్నారు. ఇటువంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు మీ చుట్టు పక్కల ఉండే వారికి అవగాహన కల్పించాలని కోరారు.

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి వారి ఆలయంలో వేం చేసిన దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించడంతో పాటు వారికి ప్రసాదాలు పంపిణీ చేశారు.

24న సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతాలు


చిట్టినగర్(విజయవాడపశ్చిమ) :వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు శ్రీదుర్గా గాయత్రి అర్చక, యాగ్నిక పురోహిత సేవా సంఘం అధ్యక్షులు విన్నకోట శ్రీనివాస రావు శర్మ పేర్కొన్నారు. 24వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో సామూహిక వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్రతాలు ఆచరించే ఆసక్తి కలిగిన భక్తులు , ఉభయదాతలు ఆలయ అర్చకులను సంప్రదించాలని కోరుతున్నామన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన ఎస్ఆర్. నందిత నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నందిత శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులను ఆలయ డీఈవో రత్నరాజు అభినందించి అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు. అనంతరం బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

గిరిజాదేవిగా భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో అమ్మవారు గిరిజాదేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కార్తిక నక్షదీక్షా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అమ్మవారికి గిరిజాదేవిగా అలంకారం చేసి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు చేశారు. అలాగే త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన నిర్వహించారు. మల్లేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన షణ్ముగం పర్యవేక్షించారు.

ఆంధ్రా జట్టు సిద్ధం

విజయవాడస్పోర్ట్స్: అనంతపురంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే సంతోష్ దక్షిణ భారత ఫుట్‌బాల్ ట్రోఫీకి రాష్ట్ర జట్టును సిద్ధం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్(ఏపీఎఫ్ఏ) అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ తెలిపారు. గత నెలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులతో జట్టును ఏర్పాటు చేశామన్నారు. ఈ జట్టుకు సీనియర్ కోచ్‌లు ఈశ్వర్, శ్యామ్‌లతో 20 రోజుల పాటు అనంతపురంలో కోచింగ్ క్యాంప్ నిర్వహించామన్నారు. ఈ ట్రోఫీలో తమిళనాడు, అండమాన్ నికోబార్, కర్ణాటక జట్లతో రాష్ట్ర జట్టు తలపడుతుందన్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, చక్రవర్తి, కోనసీమ సంఘం ప్రతినిధి నీలాద్రి అభినందించారు.

కమ్యూనిటీ హాల్‌కు వీడని గ్రహణం



పిచ్చి చెట్లతో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్ స్థలం



దర్గా మెయిన్ రోడ్ నుంచి కమ్యూనిటీ హాల్ స్థలానికి వెళ్లే దారి

- నిరుపయోగంగా ముస్లిం కమ్యూనిటీ హాల్ స్థలం
- స్థలం వద్దకు వెళ్లేందుకు సరైనా దారి లేదంటూ వీఎంసీ అధికారుల సాకులు
- దశాబ్దానికి ముస్లిం మైనార్టీల ఎదురుచూపులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీలు నివసించే భవానీపురం దర్గా(హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్) ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2011లో పట్టిన గ్రహణం ఇప్పటికీ వీడలేదు. దాదాపు రెండు వేలకుపైగా ముస్లిం మైనార్టీలు నివసించే ఈ ప్రాంతంలో జాతీయ రహదారి మీద నుంచి దర్గా లోపలకు వచ్చే రోడ్డు మాత్రమే సుమారు 15 అడుగులు ఉంటుంది (అది కూడా కొంత మేరకే). మిగిలిన అంతర్గత రోడ్లన్నీ కేవలం 5 – 6 అడుగుల వెడల్పులోనే ఉన్నాయి. దీంతో చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకోవాలన్నా షామియానా వేసుకుని చేసుకునే అవకాశం లేదు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌లో నిర్వహించుకుందామంటే అద్దెలను భరించే ఆర్థిక స్తోమత లేదు. దాంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రజాప్రతినిధులకు మొర..

ఈ క్రమంలో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు వారి ప్రయోజనార్థం నివాసాల మధ్య కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు 15 క్రితమే నగరపాలక సంస్థ సుమారు 600 చదరపు గజాలు స్థలం కేటాయించింది. ఈ స్థలానికి ఉత్తరం, దక్షిణం రోడ్లు ఉన్నాయి. నాటి నుంచి నేటి వరకు ఆ స్థలం ఖాళీగా ఉంటూ నిరుపయోగంగా పడి ఉంది. స్థలం గురించి పట్టించుకునే నాథుడు లేక దానిలో పిచ్చి మొక్కలు పెరిగి చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైంది. కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఎప్పుడు మొదలు పెడతారు..ఎప్పటికి పూర్తవుతుందా దశాబ్ద కాలానికిపైగా దర్గా వాసులు ఎదురు చూస్తున్నారు. దర్గాలో ప్రార్థనలు చేసేందుకు వచ్చే ప్రతి ప్రజాప్రతినిధికి మొరపెట్టుకుంటూనే ఉన్నారు. అప్పటికి అలాగే అంటూ తలూపి వెళ్లిపోతారు తప్ప ఆ తరువాత మళ్లీ ఇటు వైపు తొంగి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



2011లో వేసిన శంకుస్థాపన శిలాఫలకం

రూ.19.80 లక్షలతో శంకుస్థాపన

దర్గా ఏరియాలో రూ.19.80 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు 2011లో ఉమ్మడి కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్, గనులు, భూగర్భ వనరుల మంత్రి గల్లా అరుణకుమారి, పురపాలక శాఖ మంత్రి మానుగుంట మహీధరరెడ్డితో కలిసి అప్పటి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అహ్మదుల్లా శంకుస్థాపన చేశారు. అంతే.. ఆ తరువాత దాని గురించి పట్టించుకున్న నాథుడు, నాయకుడు లేరు. అనంతరం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులుగా గెలిచిన ఏ ఒక్క ఎమ్మెల్యే కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఏళ్ల తరబడి ఇక్కడికి వచ్చిన అధికారులకుగానీ, ప్రజాప్రతినిధులకుగానీ వినతి పత్రాలు సమర్పించుకోవడం .. ఫలితం కోసం ఎదురు చూడటం స్థానికులకు పరిపాటిగా మారింది. ఒక్కరైనా ప్రజానాయకుడు లేడని నిట్టూరుస్తున్నారు.

పనులు ప్రారంభించాలి..

'సమస్య మీరు చెప్పండి.. నేను చేయిస్తా' అంటూ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి పశ్చిమంలోని కొందరు కార్పొరేటర్ల(జంప్ జిలానీలు)తో సమావేశమై చెప్పటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేస్తున్నారు. కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన తరువాత నిర్మాణానికి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది సాకులు చూపి తప్పించుకుంటున్నారు. అంతర్గత రోడ్ లోపల ఉన్న స్థలం దగ్గరకు నిర్మాణ సామగ్రితో కూడిన వాహనం వెళ్లేందుకు సరైన దారి లేదని చెప్పటం విడ్డూరంగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. శంకుస్థాపన దిమ్మె నిర్మించేటప్పుడు ఆ విషయం వారికి తెలియదా.. కొండ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి రోడ్లు ఉన్నాయా? వారు కింద నుంచి సామగ్రిని పైకి మోయించుకుని కట్టుకోవడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ బడ్జెట్‌లో అదనంగా ఖర్చు అయ్యే మోత బరువు వ్యయాన్ని కూడా కలుపుకుని మొదలు పెట్టాలిగానీ సాకులు చెప్పటం తగదని వ్యాఖ్యానిస్తున్నారు.

కౌన్సెలింగ్‌తో నేర ప్రవృత్తి నివారణ



జువైనల్ హోమ్‌లో మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం (జువెనైల్ హోమ్)లో గురువారం బాలల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాల ప్రారంభ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా బాలల సంక్షేమ సమితి మాజీ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి హాజరయ్యారు. అతిథులుగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు బి. రాధాకుమారి, జువెనైల్ జస్టిస్ బోర్డ్ సభ్యులు, బాలల సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు టి.మధుసూధనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఎదిగే క్రమంలో అనేక మానసిక పరిణామాలకు లోనవుతారని తెలిపారు. పిల్లలు నేర ప్రవృత్తికి అలవాటు పడటానికి అనేక సామాజిక, కుటుంబ పరమైన అంశాలు దోహదం చేస్తాయని చెప్పారు. సరైన కౌన్సెలింగ్ లేదా ఉపాధి అవకాశాల ద్వారా వారిలో నేర ప్రవృత్తిని నివారించవచ్చని పేర్కొన్నారు. రాధాకుమారి మాట్లాడారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కో ఆర్డినేటర్ అరవ రమేష్, బర్డ్స్ సంస్థ సెక్రటరీ ప్రకాష్ కుమార్ పాటలుపాడి పిల్లలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో హోమ్ పర్యవేక్షణాధికారి రామ్మోహన్ రెడ్డి, జువెనైల్ వెల్ఫేర్ శాఖ అధికారి రాంమనోహర్, హోమ్ ఇన్‌టెక్ ప్రొహిబేషన్ అధికారి హసన్ అలీ బేగ్, అన్నామణి, సిబ్బంది పాల్గొన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గొల్లపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'బాలలపై సోషల్ మీడియా ప్రభావం ' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు కె.విజయలక్ష్మి, టీచర్లు ఎం .లక్ష్మణబాబు, కె. విశాలాక్షి, ఉజాయిర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీలో ఎ.జాహ్నవి, ఇ.పల్లవి, ఎ.రాజేశ్వరి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు.

డిపాజిటర్లకు పూర్తి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని దుర్గా కో ఆపరేటివ్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన ప్రతి ఒక్కరికీ వడ్డీతో సహా అసలు మొత్తం చెల్లించాలని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. వన్‌టౌన్ లెనిన్‌భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుర్గా కో ఆపరేటివ్ బ్యాంక్ లైసెన్స్ రద్దు చేసినట్లు రిజర్వ్‌బ్యాంక్ అధికారులు ప్రకటించడంతో వేలాది మంది డిపాజిట్ దారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఈ బ్యాంక్‌లో రిక్షా కార్మికుడి నుంచి రిటైర్డ్ ఉద్యోగుల వరకు వేలాది మంది ఐదు వేల నుంచి రూ.10 లక్షల ఇంకా ఎక్కువ మొత్తాల వరకు డిపాజిట్లు చేశారన్నారు. ఇతర జాతీయ బ్యాంకులతో పోలిస్తే అధిక వడ్డీ వస్తుందని, రిటైర్ తర్వాత తమకు ఆర్థిక భరోసా ఉంటుందని చాలామంది ఉద్యోగులు రూ.10 లక్షల వరకు డిపాజిట్ చేశారన్నారు. కానీ గతంలో బ్యాంకు పాలకవర్గం తన ఇష్టానుసారం నిబంధనలకు విరుద్ధంగా వాస్తవ విలువ కన్నా భవనాలపై అధిక రుణాలు ఇవ్వడం, ఇచ్చిన రుణాలు తిరిగి వసూలు చేయకపోవడం వల్ల రెండేళ్లుగా బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోయాయన్నారు. బ్యాంకులో అక్రమాలు జరుగుతున్నా సహకార శాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. గతంలో బ్యాంక్ పాలకవర్గాలు చేసిన తప్పులు, సహకార శాఖ అధికారుల నిర్లక్ష్యం డిపాజిటర్లకు శాపంగా మారిందని ధ్వజమెత్తారు. తమ పిల్లలకు పెళ్లి చేసేందుకు దాచుకున్న డబ్బులు చేతికి అందక చాలామంది మానసికంగా కుంగిపోయి అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్బీఐ నియమించే లిక్విడేటర్, సహకార శాఖ అధికారులు కలిసి గత పాలక వర్గాలు, బ్యాంకు ఉద్యోగుల ద్వారా అప్పులన్నీ వసూలు చేయాలని కోరారు. అదేవిధంగా ఈ బ్యాంకు ఇతర బ్యాంకులలో చేసిన డిపాజిట్లను పూర్తిగా విత్ డ్రా చేసి డిపాజిటర్లకు పూర్తిగా వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, పైడియ్య, కేవీ భాస్కరరావు, కొట్టు రమణారావు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం




బహుమతులు అందుకున్న విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):బాలల దినోత్సవం సందర్భంగా గట్టు వెనుక ప్రాంతంలోని పలు పాఠశాలల్లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ (డీఎస్ఎమ్‌సీ)లో వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎమ్ మాతంగి కోటయ్య మాట్లాడుతూ బాలలకు ఉన్న హక్కులు, బాధ్యతలను తెలుసుకుని భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. పాఠశాల పీఈటీ ఉపాధ్యాయురాలు ఎం.విజయలక్ష్మి, సిబ్బంది అన్నపూర్ణ, ప్రసాద్, వసంతలక్ష్మి పాల్గొన్నారు. గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్య అకాడమీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఆచార్యులు డాక్టర్ పి.బ్రహ్మజీ పాల్గొనగా అతిథులుగా అడ్వకేట్ కేజేఎస్ ప్రకాష్, పి.బాలగంగాధర్, సంఘం కార్యవర్గ సభ్యులు ఆర్.సత్యనారాయణ, ఆర్.గోపాలం, పాఠశాల హెచ్ఎమ్ తరుణ్ బాబు పాల్గొన్నారు. ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యాధరపురం ఆర్కే పబ్లిక్ స్కూల్ రోడ్‌లోని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో చిన్నారులు ఫ్యాన్సీ డ్రస్ వేసుకుని సందడి చేశారు. వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకట మహేష్, ప్రిన్సిపాల్ జె.సునీత కలిసి చిన్నారులతో కేక్ కట్ చేయించి బహుమతులు అందచేశారు. మానసిక ఎదుగుదల లేని చిన్నారులతో ఈ వేడుకలు జరుపుకోవడం గొప్ప అవకాశమని మహేష్ పేర్కొన్నారు. ప్రేమ్‌కుమార్, పవన్‌కుమార్, చిన్నారావు పాల్గొన్నారు.

దుర్గగుడి అభివృద్ధి పనులపై సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న మాస్టర్ ప్లాన్ పనులపై గురువారం సమీక్ష సమావేశం జరిగింది. తాడిగడపలోని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి క్యాంప్ కార్యాలయంలో ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, టెక్నికల్ టీం సభ్యులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సుజనా ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. భవానీ దీక్షలను పురస్కరించుకుని చేపట్టే పనులు, భవానీలకు కల్పిస్తున్న సదుపాయాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. పనులు టెండర్ దశలో ఉన్నాయని, భక్తులు, భవానీల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో కెఎస్.రామరావు తెలిపారు. సమీక్ష సమావేశంలో దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావు, వైకుంఠరావు టెక్నికల్ టీం సభ్యులు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రద్దీ రహదారుల్లో స్వీపింగ్ మెషిన్లు ఏర్పాటు చేయండి



భవానీపురం(విజయవాడగపశ్చిమ):నగర పరిధుల్లోని ప్రధానమైన రహదారుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో ఆయా రహదారుల్లో స్వీపింగ్ మెషిన్లను ఉపయోగించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. అనేక ప్రమాదాలు జరిగి పలువురు కార్మికులు మృత్యువాత పడ్డారని తెలిపారు. ముఖ్యంగా సీవీఆర్ ఫ్లైఓవర్, ఆర్ అండ్ బీ రహదారుల్లో సిబ్బందితో కాకుండా స్వీపింగ్ మెషిన్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల వీఐపీ కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. డెప్యుటేషన్‌పై డ్యూటీలకు తీసుకొస్తున్న కార్మికుల గురించి ఆ తరువాత పట్టించుకోవడం లేదని తెలిపారు. వినతి పత్రం ఇచ్చినవారిలో యూనియన్ గౌరవ అధ్యక్షులు జక్కి జేమ్స్, అధ్యక్షులు ఎస్‌వీఎస్ చలం, కోశాధికారి తుపాకుల నాగేశ్వర రావు, సహాయ కార్యదర్శి టి.ప్రతాప్ ఉన్నారు.

కవర్లు, ఐస్‌ల విక్రయానికి టెండర్లు

దుర్గగుడి మహామండపంలో ప్రక్రియ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ ప్రసాదాల విక్రయ కౌంటర్ల వద్ద కవర్ల విక్రయానికి, కనకదుర్గనగర్ నుంచి మహామండపం వరకు ఐస్‌బాక్స్‌లను ఏర్పాటు చేసుకోవడానికి గురువారం దేవస్థానం టెండర్లు పిలిచింది. మహా మండపం ఆరో అంతస్తులో టెండర్లు నిర్వహించారు. ఈ ప్రక్రియను ఏఈవో దుర్గారావు, సూపరిండెంటెంట్ నగేష్ పర్యవేక్షించారు. తొలుత కవర్ల విక్రయ టెండర్ ప్రక్రియ జరిగింది. ప్రథమ దరావత్తు రూ.లక్ష చొప్పున చెల్లించి ముగ్గురు కాంట్రాక్టర్లు బహిరంగ వేలంలో పాల్గొన్నారు. దేవస్థానం తన పాటను రూ. 20 లక్షలు నిర్ణయించి వేలాన్ని ప్రారంభించింది. దేవి ఎంటర్‌ప్రైజర్స్, శ్రీరామ ఎంటర్‌ప్రైజర్స్, శ్రీచేతన్ ఎంటర్‌ప్రైజర్స్ వేలంలో పాల్గొనగా, రూ.23.60 లక్షలకు దేవీ ఎంటర్‌ప్రైజర్ చెల్లించడానికి ముందుకు వచ్చింది. అనంతరం సీల్డ్ టెండర్లను తెరిచిన ఆలయ అధికారులకు ముగ్గురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. వీటిలో దేవి ఎంటర్ ప్రైజర్స్ రూ. 27,00,027 లక్షలకు కోట్ చేసింది. ఊకనకదుర్గనగర్ నుంచి మహామండపం వరకు నాలుగు ఐస్ బాక్స్‌లను ఏర్పాటు చేసుకుని ఐస్‌లను విక్రయించడానికి టెండర్ ప్రక్రియ నిర్వహించారు. రూ.50 వేలు ప్రథమ దరావత్తుగా చెల్లించి ముగ్గురు కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొన్నారు. దేవస్థానం తన పాటను రూ. 6 లక్షలుగా నిర్ణయించి వేలాన్ని ప్రారంభించింది. దేవి ఎంటర్‌ప్రైజర్స్ రూ.7.20 లక్షలు చెల్లించేందుకు ముందుకు వచ్చింది. అనంతరం సీల్డ్ టెండర్ బాక్స్‌ను తెరిచిన అధికారులకు మూడు టెండర్లు దాఖలైనట్లు తెలిపారు. సీల్డ్ టెండర్‌లో శ్రీరామ ఎంటర్‌ప్రైజర్స్ రూ.8,88,888 లక్షలకు కోట్ చేశారు. ఆన్‌లైన్‌లో ఎవరూ దాఖలు చేయకపోవడంతో టెండర్ల వ్యవహారాన్ని ఈవో దృష్టికి తీసుకువెళ్లిన తర్వాత తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి సాయం అందించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు శివరామప్రసాద్, ఎన్వీ రావు తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చేతనైనంతలో సమాజాభివృద్ధికి సాయం అందించాలనే భావన యువతలో కలగడం అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఎక్స్‌పాండింగ్ హ్యూమానిటీ ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ డీన్ ప్రొఫెసర్ రామినేని శివరామ ప్రసాద్, బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి, రాకేష్ విద్యాసంస్థల అధినేత ఎన్వీ రావు, చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణకుమారి, ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ అఫీపాలు హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఎక్స్‌పాండింగ్ హ్యూమానిటి ట్రస్ట్ వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. సమాజ సేవ చేయాలన్న సంకల్పం యువతలో కలగడం అభినందనీయమని, ట్రస్ట్‌ను ముందుకు తీసుకువెళ్లి సేవా కార్యక్రమాలను మరింతగా చేపట్టాలని అతిథులు పేర్కొన్నారు. ట్రస్ట్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని అనాథాశ్రమంకు చెందిన 200 మందికి అన్నదానం నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్నాడు కలెక్టర్ అరుణ కుమార్ సతీమణి అంకితారాజ్‌లతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న చిన్న వీరోజి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కొండ ప్రాంతాల్లో నివాసాలకు ప్రభుత్వం వెంటనే ఉచిత రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ కోశాధికారి తోకల చిన్న వీరోజీ కోరారు. విజయవాడ లంబాడీపేటలోని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్న వీరోజి మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో నివాసాలకు ఎన్టీఆర్ హయాంలో ఉచితంగా పట్టాలు ఇచ్చారని, అయితే గతంలో అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబునాయుడు ఆ పట్టాలకు రిజిస్ట్రేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇటీవల ఎన్నికల్లో సైతం చంద్రబాబునాయుడు ఇదే హామీ ఇచ్చారని, దానిని వెంటనే నిలబెట్టుకోవాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పినా ఇంత వరకు ఆ దిశగా ఎటువంటి అడుగులు పడలేదన్నారు. కొండ ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు ఎంతో కాలంగా తమ నివాసాలకు రిజిస్ట్రేషన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు మేలు చేసే విధంగా వెంటనే కొండ ప్రాంతాల్లో ఇళ్లకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని ఎన్టీఎఫ్ జిల్లా అధ్యక్షులు జగన్నాథం చంటి, కోశాధికారి తోకల నాగేశ్వర రావు, నగర అధ్యక్షులు కుంభ గోపి పేర్కొన్నారు.

రాంపిళ్ల నరసాయమ్మకు పలువురు నివాళి



నరసాయమ్మకు నివాళులర్పిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర సమర యోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ మృతి దేశానికి తీరని లోటని హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. రాంపిళ్ల నరసాయమ్మకు గురువారం పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. నరసాయమ్మ రెండో కుమారుడు రాంపిళ్ల జయప్రకాష్‌కు భూపేందర్‌సింగ్ హుడా తన సందేశాన్ని పంపారు. నరసాయమ్మ స్వాతంత్ర సమర యోధుల కోసం నిర్వహించిన పలు కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. గురువారం ఉదయం సయ్యద్ అప్పలస్వామి కళాశాల సమీపంలోని నరసాయమ్మ స్వగృహానికి నగరానికి చెందిన పలువురు ప్రముఖులు తరలివచ్చి నివాళులర్పించారు. కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులు, కార్పొరేటర్లు ఉమ్మడి చంటి, బోయి సత్యబాబు, నగరాల సంఘం నాయకులు ఎన్వీ రావు, బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావులతో పాటు పలువురు ప్రముఖులు హాజరై అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో సామాజిక వికాసం



పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో పోటీల్లో పాల్గొని సందడి చేస్తున్న విద్యార్థులు



మౌలానా ఆజాద్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు కల్యాణిని సత్కరిస్తున్న అతిథులు



పుస్తకాలను తిలకిస్తున్న అతిథులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గ్రంథాలయాలతో సామాజిక వికాసం సాధ్యమని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. అలాగే బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎంత శ్రమిస్తే అంత ఉన్నతికి చేరుకుంటారని వివరించారు. పాఠశాల కోశాధికారి కె.రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఏ పతంజలి శాస్త్రి, డాక్టర్ సురేష్‌బాబు, రోటరేక్ట్ కోఆర్డినేటర్ పీ నరేష్ తదితరులు పాల్గొన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలు ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి కార్యదర్శి టి.శ్రీనివాసు, హిందూ హైస్కూల్ కమిటీ ఏటీ డాక్టర్ వి.నారాయణరావు గ్రంథాలయ విభాగాధిపతి వై.శ్రీనివాసరాజు, అధ్యాపకులు డాక్టర్ జేవీ చలపతిరావు, గ్రంథాలయ సిబ్బంది వి.విజయలక్ష్మి, డి. నాగలక్ష్మి పాల్గొన్నారు. ఇస్లాంపేటలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీదేవి, స్థానిక కార్పొరేటర్ అప్పాజీరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం జరిగింది. పాఠశాల హెచ్ఎంగా పని చేసి ఇటీవల పదవీ విరమణ చేసిన రామలింగేశ్వరరావును సత్కరించారు. అలాగే పాఠశాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమాన్ని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి పర్యవేక్షించారు.

విజయవాడకల్చరల్: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని ప్రపంచ రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు, అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించే 52వ గ్రంథాలయ వారోత్సవాలు, పుస్తక ప్రదర్శనను గురువారం సొసైటీ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. నేటి యువతను గ్రంథాలయాల వైపు నడిపించాల్సిన అవసరముందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవి మాట్లాడుతూ గ్రంథాలయాలు తన సాహిత్య జీవితాన్ని ప్రభావితం చేశాయని వివరించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుడు వెంకటనారాయణ వారోత్సవాల లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో గోళ్ళ నారాయణరావు, కార్యవర్గ సభ్యులు బెల్లపు బాబ్జీ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి అయ్యప్పస్వామి గుడిలో అన్నదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ):విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని అయ్యప్ప దేవాలయంలో స్వాములకు ఏటా నిర్వహించే అన్నదాన కార్యక్రమం ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ప్రారంభం కానుందని ఆలయ ధర్మకర్త గెల్లి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత తొమ్మిదేళ్ల నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం ఇక్కడ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఇంద్రకీలాద్రిపైగల శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కేఎస్ రామరావు లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. జనవరి 14వ తేదీ (మకరజ్యోతి దర్శనం) వరకు దాదాపు రెండు నెలలపాటు అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం జరుగుతుందని పేర్కొన్నారు. రోజుకు కనీసం 2 వేల మంది స్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారని చెప్పారు. డిసెంబర్ నెలలో రోజుకు ఐదు వేల మంది అవుతారన్నారు.